క్లుప్తంగా

'గుట్ట' రూరల్ సీఐగా వేణుగోపాల్‌రావు


వేణుగోపాల్‌రావు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డిని బదిలీ చేస్తున్నట్లు రాచకొండ కమిషనర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో భువనగిరి స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న వేణుగోపాల్‌రావును నియమించారు. ప్రస్తుతం సురేందర్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వలేదు.

రామన్నపేట సీఐగా శ్రీనివాస్


ఎస్.శ్రీనివాస్

రామన్నపేట : రామన్నపేట సీఐగా ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్బీనగర్ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఆయనను రాచకొండ పోలీస్ కమిషనర్ శుక్రవారం రామన్నపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న మోతీరాంను మల్కాజ్‌గిరి సీసీఎస్‌కు, ఎస్ఐ ఎం.లక్ష్మయ్యను చౌటుప్పల్‌కు బదిలీ చేశారు.

వలిగొండ ఎస్ఐగా మహేందర్


మహేందర్ లాల్

వలిగొండ : మండల నూతన ఎస్ఐగా డి.మహేందర్ లాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. మహేందర్ కుషాయిగూడలో ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై మండలానికి వచ్చారు.

ఆలయ చైర్మన్‌గా దశరథరెడ్డి


దశరథరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రామన్నపేట : మండలంలోని సిరిపురంలో గల శ్రీసీతారామంజనేయస్వామి దేవాలయం చైర్మన్‌గా కట్ట దశరథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా స్థానిక పార్వతీపరమేశ్వర దేవాలయం తాత్కాలిక అధ్యక్షుడిగా పున్న జగన్మోహన్, ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా రాపోలు రమేష్, డైరెక్టర్‌గా కంకల మల్లేశంను ఎన్నుకున్నారు. సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ బడుగు రమేష్, ఉపసర్పంచ్ దాసిరెడ్డి శ్రవన్‌కుమార్‌రెడ్డి, మాజీచైర్మన్ రాపోలు స్వామి, వివిధ పార్టీల నాయకులు మేక అశోక్‌రెడ్డి, అప్పం రామేశ్వరం, రాపోలు నర్సింహ, సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, బండ శ్రీనివాస్‌రెడ్డి, పున్న వెంకటేశం, కూనూరు సుదర్శన్, ఏళ్ల సంజీవరెడ్డి, బల్గూరి అంజయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గుండాల : మండలంలోని బండకొత్తపల్లి గ్రామ బిక్కేరువాగులో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం గ్రామస్తులు మండల తహసీల్దార్ జలకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో అక్రమంగా ట్రాక్టర్ యజమానులు ఇసుకను ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐ యాకన్నకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ గోపాల్‌దాస్ భిక్షమమ్మ, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, గ్రామస్తులు మల్లిఖార్జున్, ఉపేందర్, విజయ్ ఉన్నారు.

ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

భువనగిరి రూరల్ : మండలంలోని రాయగిరి యూనిటీ ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఏ గ్రేడ్ ప్రకటించినట్లు కళాశాల చైర్మన్ ఏ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నవంబర్‌లో కళాశాలను సందర్శించిన న్యాక్ బందం కళాశాలలోని వసతుల పట్ల విద్యాబోధన విధానాలపై తనిఖీ నిర్వహించి నివేదికలను సమర్పించగా కౌన్సిల్ పరిశీలించి ఏ గ్రేడ్‌ను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సోంచంద్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, ఏఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం జేతురాంతండా ఆర్‌అండ్‌బీ రోడ్డు మూలపు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఎలగల అరవింద్ (20) బింగి శేషు (16) బైక్‌పై తుర్కపల్లి నుంచి భువనగిరి వైపునకు వెళ్తున్నారు. మండలంలోని జేతురాం తండా ఆర్‌అండ్‌బీ రోడ్డు మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో అరవింద్ బండిపై నుంచి ఎగిరి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్నేహితుడు బింగి శేషు బైక్‌తో పాటు కాలువలో పడ్డారు. గాయపడిన శేషును కాలువలోంచి వెలికి తీసి ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదు

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : అభివృద్ధి చేసే విషయంలో రాజకీయాలకు ఏమాత్రం తావులేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తంగడపల్లి రోడ్డులోని నాగులకుంట నుంచి బంగారిగడ్డ వరకు రూ.50లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీలోని 20వార్డులు సమగ్రంగా అభివృద్ధి జరగాల్సిందేనన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. అధికారులు పక్షపాతం లేకుండా కౌన్సిలర్లకు నిధులు కేటాయించాలని ఆదేశించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ జగన్నాథరావు, మున్సిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, వైస్‌ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కౌన్సిలర్లు ఎండీ.బాబాషరీఫ్, కొయ్యడ సైదులుగౌడ్, బండమీది మల్లేష్, ఆలె నాగరాజు, సుల్తాన్ రాజు, కొరగోని లింగస్వామి, వరమ్మ, మంజుల, విజయ, తదితరులు పాల్గొన్నారు.

సమాజం కోసం ఆలోచన చేయాలి

విద్యార్థులు తమ ఉన్నతితో పాటుగా సమాజం బాగుకోసం కూడా ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. టాపర్స్, వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ కె.దీప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ జగన్నాథరావు, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ సందీప్‌కుమార్, వైస్‌ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు, అధ్యాపకుల పాల్గొన్నారు.


చౌటుప్పల్ : సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మెల్యేకు వినతి

పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల నేపథ్యంలో తమపై నమోదైన కేసులను ఉపసంహరింపజేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు శివకుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పట్టణంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వర్కాల కిషోర్, ప్రధాన కార్యదర్శి రేగట్టె రాజిరెడ్డి, ప్రతినిధులు మోటె సత్తయ్య, భీమిడి ఉపేందర్‌జీ, కేఆర్ మాధవరెడ్డి, భాస్కర్, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.


సంస్థాన్ నారాయణపురం : చిమిర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తా : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : గోదావరి జలాలతో మునుగోడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోతులాపురం, చిమిర్యాల, చిల్లాపురం, కొత్రతండాలలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాగునీటి సమస్య తీర్చడానికి బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాన్నారు. లింగవారిగూడెం నుంచి దేవిరెడ్డిబంగ్లా వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని లింగవారిగూడెం ఉపసర్పంచ్ సరళ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, గుత్త ప్రేంచందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్, సర్పంచ్‌లు పోట్ట సత్తయ్య, దోనూరి జైపాల్‌రెడ్డి, మంజుల, కొత్ర లచ్చిరాం, ఎంపీటీసీ శివరాత్రి కవితసాగర్, నర్సిరెడ్డి, బాలకృష్ణ, లింగస్వామి తదితరులున్నారు.

ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జగత్‌పల్లి, పెద్దగూడెం, గౌస్‌కొండ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంతో పాటు దోతిగూడెం గ్రామంలో యాదవ సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని, ప్రజల నుంచి కోటి 5లక్షల దరఖాస్తులను స్వీకరించి వాటిని డిజిటలైజేషన్ చేశామన్నారు. అంతర్గత రోడ్లు, మూసీ బ్రిడ్జీలు, అసంపూర్తిగా ఉన్న పిలాయిపల్లి కాలువను పూర్తి చేయాలని ఇటీవల జరిగిన పలు రివ్యూ సమావేశాలలో చర్చించినట్లు వెల్లడించారు. సేవాభావంతో గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచులను అభినందించారు. శ్మశానవాటిక ప్రహరీ, ఆర్టీసీ బస్సులను నడపాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ వీరాభాయి, ఎంపీఓ మాజిద్, సర్పంచులు నోముల ఎల్లారెడ్డి, మన్నె పద్మారెడ్డి, పక్కీరు లావణ్యదేవేందర్‌రెడ్డి, పగిళ్ల స్వప్న రాంరెడ్డి, ఎంపీటీసీ అమృతధర్మారెడ్డి, చిలుక బుచ్చయ్య, నాయకులు పాక మల్లేశ్, తడక వెంకటేశం, మర్రి నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి, సామ మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, నోముల మమత, జితేందర్‌రెడ్డి, ఇటమోని మహేశ్, పాల్గొన్నారు.

అనిరెడ్డి నర్సిరెడ్డికి నివాళి

మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అనిరెడ్డి జగన్‌రెడ్డి తండ్రి అనిరెడ్డి నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శనివారం నర్సిరెడ్డి సంతాప సభకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షుడు పాక మల్లేశ్, తడక వెంకటేశం, మర్రి నర్సింహారెడ్డి, కల్లెం రాఘవరెడ్డి, సామ మోహన్‌రెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, మర్రి రాజిరెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


భూదాన్‌పోచంపల్లి : పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యేకు వినతి

వలిగొండ : మండలంలోని సాక్షరభారత్ కోఆర్డినేటర్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని, లేదా ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారిలో కొమిరె బాలేశ్వర్, బుగ్గ బీరప్ప, నీలం నరేందర్, పోలేపెల్లి బాలనర్సింహ, రజిత, సునీతా, ధనలక్ష్మి, మాధవి, సుజాత, చైతన్య, ప్రతిభ, స్వరూప ఉన్నారు.


వలిగొండ : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కోఆర్డినేటర్లు

దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యం

● మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తుర్కపల్లి : దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని పీఎం విశ్వకర్మ యోజన పథకం రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. మండల అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా నాయకులు మాదిరెడ్డి సుభాష్‌రెడ్డి, ఆకుల సైదులు, రమేశ్, సర్పంచ్ వనితశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

రాజాపేట : రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కేవలం మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, ఎంపీటీసీ దాచపల్లి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కాయితి బాల్‌రెడ్డి, నాయకులు రమేష్, సిద్దేశ్వర్, నర్సింగరావు, మాధూరి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రాజాపేటలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

బొమ్మలరామారం : బీజేపీ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులపై ఆధారపడిన ప్రజలకు లబ్ధి చేకూర్చే వికసిత్ భారత్, నర్సన్న బీమా, విశ్వకర్మ యోజన పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి సుభాష్‌రెడ్డి, ఎంపీటీసీ పక్కీరు రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు జగ్గర్ల ఆనంద్‌గౌడ్, తిరుమల కృష్ణగౌడ్, నరేష్, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు : తెలంగాణలో పదేళ్ల పాలనలో కేసీఆర్, కేటీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 14ఏళ్ల పాటు జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ తనయులు కేటీఆర్, కవిత ఎక్కడున్నారో చెప్పాలని అన్నారు. కేటీఆర్, ఆయన బావ హరీష్‌రావు బిల్లా, రంగాలుగా మారి రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో దోచుకున్న సొమ్ము, కుంభకోణాలపై తేల్చడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. కాంట్రాక్టర్లు, దోపిడీదారులకు మాత్రమే రాత్రులు కేసీఆర్ అపాయిట్‌మెంట్ ఇచ్చారని, తెలంగాణ ఉద్యమకారుడిగా తాను రెండేళ్లుగా ప్రయత్నించినప్పటికీ కలువలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, కారుపోతుల వెంకన్నగౌడ్, మందుల సురేష్, పేలపూడి సత్యనారాయణచౌదరి, బద్దం నాగార్జునరెడ్డి, ఎండీ.సమీర్, జినుకల కనకయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, చేడె చంద్రయ్య, మైనార్టీ సెల్ నాయకులు సమీర్ తదితరులు పాల్గొన్నారు.


మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ముస్లిం, మైనార్టీ నాయకుల సన్మానం

మోత్కూరు పట్టణానికి శనివారం విచ్చేసిన ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ముస్లిం మైనార్టీ నాయకులు శాలువాలు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎండీ.ఖాజా, ఖాసీమ్, సమీర్, ఖలీల్, జావేద్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పేలపూడి సత్యనారాయణ చౌదరి, స్థానిక సర్పంచ్ పేలపూడి మధు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు సోదరుల చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ తల్లిదండ్రులు పేలపూడి అంతయ్య, అచ్చమ్మ జ్ఞాపకార్థం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆవిష్కరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కప్పల చామంతి(28), కన్నేబోయిన లింగయ్య(60) ఇటీవల మృతి చెందాడు. శనివారం ఎమ్మెల్యే సామేల్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కన్నేబోయిన లింగయ్య కుటుంబానికి రూ.25వేలు, కప్పల చామంతి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట లాదినేని నాగయ్య, రాములు, పూర్ణచందర్, లక్ష్మన్‌చారి ఉన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌కు వినతి

మోత్కూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ధర్మారం గ్రామంలో ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ.. మోత్కూర్‌లో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే అడ్డగూడూరు, మోత్కూర్, అమ్మనబోలు, ఆత్మకూరు మండలాల విద్యార్థులకు అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే గ్రామాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయన వెంట వంశీకుమార్, నాని, రాజు ఉన్నారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకం

మోత్కూరు : విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభాజస్టిస్ అన్నారు. శనివారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాజస్టిస్ మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశలో క్రమశిక్షణతో ముందుకు పయణిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని అన్నారు. త్వరలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధులై ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిగుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోత్కూరు, ఆత్మకూరు (ఎం), ఖప్రాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, దేవినేని అరవింద రాయుడు, దడిపల్లి వెంకన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కడారు నర్సింహారెడ్డి, కళాశాల లెక్చరర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభా జస్టిస్

సంక్షిప్త సమాచారం

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

భువనగిరి : పట్టణంలో ప్రపంచ ఎలక్ట్రీషియన్ డే వేడుకలను శనివారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు పట్టణంలో సాయిబాబా ఆలయం నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి మల్లేష్, ఉపాధ్యక్షులు కొండమడుగు బాలరాజు, గౌరవ అధ్యక్షుడు ఎట్టబోయిన శివశంకర్, కొండల్, దేవేందర్, నరేందర్, అజీమ్, నగేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

ఆలేరురూరల్ : కాంగ్రెస్ పార్టీ నుంచి సిరిగిరి సాగర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు శర్బనాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు బుగ్గ నరేష్ తెలిపారు. శనివారం మండలంలోని శర్బనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ భార్య అనిత సర్పంచ్‌గా ఉన్నారు. సమావేశంలో శ్రీహరి, వెంకయ్య, నరేష్, బోడ నరేష్, నర్సింహులు, మహేందర్, సంతోష్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

మోటకొండూర్ : మండలంలోని చాడ గ్రామ పరిసర ప్రాంత ప్రజలకు గతంలో నడిచిన ఆర్టీసీ బస్సులను మళ్లీ పునరుద్ధరించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు యువకులు యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. వారిలో ఆకుల శ్రీనివాస్, రాజబోయిన మధు, మల్లం మనీష్‌కుమార్, సైదులు, దిలీప్‌కుమార్, మహేష్ ఉన్నారు.

బాలుడిని బడిలో చేర్పించిన వెంకటేశ్

భువనగిరి రూరల్ : కుటుంబ సమస్యలతో నాలుగు నెలలుగా బడి మానేసి ఇంటి దగ్గర ఉంటున్న బాలుడిని గుర్తించి బడిలో చేర్పించారు పారాలీగల్ వలంటీర్ కొడారి వెంకటేశ్. మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన రాజమల్లు హత్య కేసులో జైలులో ఉంటున్నాడు. అప్పటి నుంచి రాజమల్లు భార్య మాధవి కుమార్తె అన్విక, కుమారుడు రాసాల ప్రణీత్(7)తో బస్వాపురంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రణీత్‌ను చేర్పించడానికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు తుక్కాపురం ఇంట్లో ఉండడంతో బడి మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం వెంకటేశ్ జిల్లా న్యాయసేవా సంస్థ దృష్టికి తీసుకువెళ్లగా జిల్లా జడ్జి ఆదేశానుసారం ప్రణీత్‌ను బస్వాపురంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

గుండాల : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని సీఆర్‌పీ దేవరబోయిన లింగయ్య అన్నారు. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన ఆవాస ప్రాంతం యేనెబావితండాకు చెందిన సంచార జాతుల పిల్లలు గుండాలలో గూడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం సీఆర్‌పీ లింగయ్య పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి గుండాల ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

మోత్కూరు : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ టికెట్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు చేడె అంబేద్కర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సూరారం నవీన్ కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కిరణ్‌కుమార్ రెడ్డి 20సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో ఉంటూ పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు నవీన్, ఎండీ.మోహిజ్, సంపత్, వినయ్ ఉన్నారు

శ్రమదానంతో కాల్వగండి పూడ్చివేత


గండిని పూడ్చుతున్న రైతులు

రామన్నపేట : వలిగొండ మండలంలోని గొల్నేపల్లి శివారులోని ధర్మారెడ్డిపల్లి కాలువ గైడ్‌వాల్‌కు పడిన గండిని శనివారం రామన్నపేట రైతులు కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు బర్ల స్వామి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పూడ్చివేశారు. రైతులు, మహిళలు గండిని పూడ్చడానికి అవసరమైన సిమెంట్, కంకర, ఇసుకను బస్తాలలో నింపి అర కిలోమీటర్ మేర పొలాల గట్ల మీదుగా మోశారు. పలు ప్రాంతాల్లో కాలువలోని చెత్తను తొలగించారు. శ్రమదానంలో రైతులు గొరిగె శంకరయ్య, పెద్దకుర్మ శ్రీను, మొటె క్రాంతి, మోటె బీరప్ప, మోటె రాములు, మొటె లింగస్వామి, బండ లింగస్వామి, గణేష్, మోటె మహేష్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థినులు

అడ్డగూడూరు : మండలంలోని కంచనపల్లి గ్రామంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందిర మాట్లాడారు. అనంతరం వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ వీరాస్వామి, వైస్ ఎంపీపీ ఇల్లందుల మల్లేష్, సర్పంచ్‌లు పన్నాల బాయమ్మ, అమరేందర్ రెడ్డి, స్వప్న సైకిలాబ్‌రెడ్డి, మున్ని, విజయ, మంత్రి రాజు, పాండు, ఎట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రాజాపేట : జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న మండల ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావును శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ దినకర్, కార్యదర్శులు రేకులపల్లి భాస్కర్‌రెడ్డి, చక్రిధర్, లక్ష్మణ్, పవన్, ఉమేష్, సంపత్, రాజమహేందర్‌రెడ్డి, మహేష్, మౌనిక, మమత ఉన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను గుర్తించి గుర్తింపుకార్డులతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహులు అన్నారు. శనివారం పట్టణానికి తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర చేరుకుంది. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు హేమలత, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.20 వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. 6 ఫ్యాన్లు, 2 ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు దొంగిలించారని, వీటి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి


మోహన్ (ఫైల్)

రామన్నపేట : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మేకల మోహన్(49) చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని ఓ ప్రైవేట్ కంపనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 25న రాత్రి అతడు విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా రామన్నపేట రైల్వేట్రాక్ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాయిగూడెంలో ఒకరు..

భువనగిరి క్రైం : అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఆలేరు మండలం, సాయిగూడెం గ్రామానికి చెందిన సోమయ్య ఈ నెల 20న భువనగిరి మండలంలోని రాయగిరి ఫ్లెటైవర్ సమీపంలో స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం : భువనగిరి పట్టణంలోని తారకరామనగర్‌లో హాస్టల్ వెనుక రైల్‌ట్రాక్ పక్కన గల మురుగునీటిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సుమారు 35 నుంచి 40 వయస్సు గల వ్యక్తి మెరూన్ కలర్ రంగు, నిండు చేతుల చొక్కా దానిపై బ్లూ కలర్ చెక్స్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సుధీర్ కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్‌కృష్ణ తెలిపారు.